
# ఆశీర్వాదమస్తు

- మూడు ప్రజా ఆశీర్వాద సభల సక్సెస్‌తో బీఆర్ఎస్ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం
- స్ఫూర్తినింపిన పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రసంగాలు
- ఇంటింటికీ మ్యానిఫెస్టోను చూపుతూ కార్యకర్తల విస్తృత ప్రచారం
- 5న ఖమ్మం, కొత్తగూడెంలో సీఎం సభలు
- భారీ జనసమీకరణపై దృష్టి సారించిన మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యే వనమా
- సభా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి, ఎంపీలు నామా, వద్దిరాజు, వనమా



ఖమ్మం, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి జిల్లా పరిధిలోని పాలేరు, సత్తుపల్లి, ఇల్లెందులో ఇటీవల జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు విజయవంతం కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నయా జోష్ నిండింది. సభలకు భారీగా ప్రజలు విచ్చేశారు. సీఎం కేసీఆర్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే ఉమ్మడి జిల్లాలో మూడు సభలు నిర్వహించడం విశేషం. నోటిఫికేషన్ తర్వాత సీఎం కేసీఆర్ ఆదివారం మరో రెండు సభలకు విచ్చేయనున్నారు. దీన్నిబట్టి కేసీఆర్ ఉమ్మడి ఖమ్మం జిల్లాపై ఎంత దృష్టి సారించారో అర్థం చేసుకోవచ్చు. సభల తర్వాత బీఆర్ఎస్ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను తీసుకెళ్తున్నారు. బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఓట్లు అభ్యర్థిస్తున్నారుఉ.

**పాలేరు సభలో తుమ్మల, పొంగులేటిపై ఫైర్**

ముఖ్యమంత్రి కేసీఆర్ అక్టోబర్ 27న పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలం జీళ్లచెరువులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగించిన తీరు ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని విమర్శించిన విధానంపై సభికుల నుంచి మంచి స్పందన వచ్చింది. 'తుమ్మలకు బీఆర్ఎస్ ద్రోహం చేసిందా..? బీఆర్ఎస్‌కు తుమ్మల ద్రోహం చేశారా?' అని సీఎం కేసీఆర్ ప్రశ్నించినప్పుడు ప్రజల నుంచి తుమ్మలకు వ్యతిరేకంగా నినాదాలు వినిపించాయి. అలాగే మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేరు ప్రస్తావించకుండానే కేసీఆర్ చురకలు అంటించారు. 'కొందరు బీఆర్ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటును తాకనివ్వం' అని అంటున్నారని, ప్రజల శక్తి ముందు వారంతా కొట్టుకుపోతారని ప్రకటించడంపై హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి.

**కల్లూరు, ఇల్లెందు సభల్లో జోష్..**

సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని కల్లూరు మండల కేంద్రంలో ఇటీవల జరిగిన ప్రజా ఆశీర్వాద సభ బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. సీఎం కేసీఆర్ పరోక్షంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యవహారశైలిని సభాముఖంగా ఎండగట్టారు. అసెంబ్లీ గేటు తాకనివ్వబోమని చేసిన పొంగులేటి వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. అలాగే ఇల్లెందు ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ 'ఉద్యమాల గడ్డ.. పోరాటాల పురిటిగడ్డ ఇల్లెందు' అని ప్రస్తావించినప్పుడు సభికులు కేరింతలు కొట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దళారుల రాజ్యమేనంటూ చేసిన ప్రసంగం ప్రజలను ఆకట్టుకుంది.

**రేపు రెండు సభలు..**

ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో జరుగనున్న సీఎం కేసీఆర్ సభ మంత్రి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎంపీ నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మూడురోజులుగా ఖమ్మంలోనే మకాం వేసి మంత్రి పువ్వాడతో కలిసి సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసేందుకు ఇప్పటికే ఖమ్మం నగర పరిధిలోని అన్ని డివిజన్లతోపాటు రఘునాథపాలెం మండలంలోనూ బీఆర్ఎస్ శ్రేణులు జన సమీకరణ చేస్తున్నాయి. 2018 శాసన సభ ఎన్నికల ప్రచార సమయంలోనూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇదే కళాశాల మైదానంలో నిర్వహించిన సభకు విచ్చేశారు. పువ్వాడ అజయ్‌కుమార్‌ను గెలిపించాలని సభాముఖంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆ ఎన్నికల్లో పువ్వాడ అజయ్‌కుమార్ ఘన విజయం సాధించారు. ఎమ్మెల్యే అజయ్‌కుమార్ గెలిచిన తర్వాత సీఎం కేసీఆర్ మంత్రి పదవి కట్టబెట్టారు. కొత్తగూడెంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభలకు భారీగా జన సమీకరణ చేసేందుకు నాయకులు కృషి చేస్తున్నారు. ఖమ్మంలో సభ పూర్తి కాగానే సీఎం వెంటనే హెలికాప్టర్‌లో కొత్తగూడెం చేరుకుని ప్రసంగిస్తారు. సీఎం కేసీఆర్ రాక కోసం పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాయి.



## అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే..
# మళ్లీ కేసీఆరే రావాలి

**ఇందుకోసం కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలి**

**ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకే సీతారామ ప్రాజెక్టు**

**జూలూరుపాడు ప్రచారంలో రాములునాయక్, మదన్‌లాల్**



ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ శ్రేణుల కోలాహలం

జూలూరుపాడు, నవంబర్ 3: తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ కేసీఆరే సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైరా ఎమ్మెల్యే రాములునాయక్, బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి మదన్‌లాల్ స్పష్టం చేశారు. ఇందుకోసం కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. జూలూరుపాడు మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. మండలంలోని వినోభానగర్‌లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం వినోభానగర్, వీరభద్రాపురం, సూరారం, గుండెపుడి, రామచంద్రాపురం, నల్లబండబోడు, గంగారంతండా, గాంధీనగర్, శంబునిగూడెం, అనంతారం, రామకృష్ణాపురం గ్రామాల్లో ప్రచార రథంపై ఉంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ నిర్మాణం కేసీఆర్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రపంచంలో ఏక్కడాలేని విధంగా రైతుబంధు పథకాన్ని తెచ్చిన ఘనత కూడా బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. సీఎం కేసీఆర్ తెచ్చిన రైతుబీమా పథకానికి అంతర్జాతీయ గుర్తింపు కూడా లభించిందని అన్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఉమ్మడి జిల్లా పాడి పంటలతో సస్యశ్యామలమవుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు యల్లంకి సత్యనారాయణ, లావుడ్యా సోని, భూక్యా కళావతి, చావా వెంకటరామారావు, యదళ్లపల్లి వీరభద్రం, పోలుదాసు కృష్ణమూర్తి, దుద్దుకూరి నాగేశ్వరరావు, సాయిన్ని లక్ష్మణ్‌రావు, మంగముడి నాగేశ్వరరావు, నిమ్మటూరి కనకయ్య, యల్లంకి సత్యనారాయణ (వైఎస్), ధరావత్ నాగేశ్వరరావు, సాయిన్ని హరీశ్, కంచర్ల సూర్యప్రకాశ్, మాళోత్ నర్సింహారావు, హరిలాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

- ఓటేసి అభివృద్ధికి పట్టం కట్టాలని అభ్యర్థన
- ఊరూరా బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారం

# ప్రచార జోరు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారం జోరుగా సాగుతోంది. శుక్రవారం ఊరూరా ప్రచారంలో నిమగ్నమైన ఎమ్మెల్యే అభ్యర్థులకు మహిళలు పూలు చల్లుతూ.. తిలకం దిద్దుతూ స్వాగతం పలికారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి తమకు ఓటు వేయాలని అభ్యర్థులు ఓటర్లను అభ్యర్థించారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలని, ఎమ్మెల్యేలుగా తమను గెలిపిస్తే అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగుతుందని, సంక్షేమం మరింత రెట్టింపు అవుతుందని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. – నమస్తే నెట్‌వర్క్



నీకు ఓటొచ్చాక నాకే : మధిరలో ప్రచారంలో బీఆర్ఎస్ మధిర ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు



పార్టీలో చేరిన వారికి కరచాలనం ఇస్తూ ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ పాలేరు ఎమ్మెల్యే అభ్యర్థి కందాళ



చాయ్ మీకు.. ఓటు నాకు.. : పెనుబల్లిలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



ఓట్ మనగాల్.. అంటూ గిరిజన భాషలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియానాయక్



జూలూరుపాడు: వినోభానగర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్



తిప్పాపురంలో ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లంకు స్వాగతం పలుకుతున్న ప్రజలు